సాక్షి
కాకినాడ
సోమవారం । 15 । మే । 2023



వ్యసనాలతో చోరీల బాట


అతనో బ్యాంకు ఉద్యోగి.. ఎనభై వేలకు పైబడి జీతం వస్తున్నా వ్యసనాల ఉచ్చులో పడి చివరికి చోరీలను అలవాటుగా మార్చుకున్నాడు.. ఉద్యోగాన్నీ పోగొట్టుకుని పోలీసులకు చిక్కాడా నిందితుడు. 8లో



ఉష్ణోగ్రతలు

రాజమండ్రి	గరిష్టం: 44.5	కనిష్టం: 27.0
కాకినాడ	గరిష్టం: 37.8	కనిష్టం: 27.9
అమలాపురం	గరిష్టం: 43.1	కనిష్టం: 27.0

8,971 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం సాయంత్రం 8,971 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచి పెట్టారు. ఎగువ నుంచి వచ్చే నీరు తగ్గడంతో మిగులు జలాల విడుదలను తగ్గించారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

‘మహిళలకు మీ నాన్న ఏం చేశారో చెప్పు లోకేష్’

పిఠాపురం: ‘మహిళా సంక్షేమానికి మీ నాన్న చంద్రబాబు ఏం చేశారో చెప్పు’ అని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత టీడీపీ నేత నారా లోకేష్‌ను ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమాన్ని విస్మరించిందంటూ లోకేష్ చేసిన తప్పుడు విమర్శలను ఆమె ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. లోకేష్ వాఖ్యలు అర్థరహితమన్నారు. మహిళా సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని పేర్కొన్నారు. మహిళలు సామాజికంగా, ఆర్థికంగా తలెత్తుకుని నిలిచేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని, మహిళలందరూ ఆయన వెంట నడుస్తుంటే లోకేష్‌కు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. మహిళా సంక్షేమం గురించి మాట్లాడే అర్హత లోకేష్‌కు కానీ, చంద్రబాబుకు కానీ లేదని సుజాత పేర్కొన్నారు.

లోవలో భక్తుల సందడి

తుని రూరల్: తలుపులమ్మ వారిని దర్శించేందుకు వచ్చిన భక్తులతో లోవ దేవస్థానంలో సందడి నెలకొంది. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి ఏడు వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్టు చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయంతో రూ.1,13,370, పూజా టికెట్లకు రూ.75,400, కేశ ఖండన శాలకు రూ.12,450, వాహన పూజలకు రూ.6,050, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెల రూపంలో రూ.54,100, దాతల విరాళాలుగా రూ.1,34,452 కలిపి రూ.3,95,822 ఆదాయం సమకూరిందని వారు వివరించారు.

విఘ్నేశ్వరా భజేహం


అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసాలు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు చేశారు. లఘున్యాస అభిషేకాలు, లక్ష్మీగణపతి హోమంలో అధిక సంఖ్యలో భక్త దంపతులు పాల్గొన్నారు. స్వామివారికి గరిక పూజ చేశారు. పలువురు నూతన వాహనాలకు పూజలు చేయించుకున్నారు. చిన్నారులకు అన్నప్రాసనలు, అక్షరాభ్యాసాలు, నామకరణలు జరిగాయి. స్వామివారి ప్రత్యేక దర్శనం ద్వారా 26,500, అన్న ప్రసాదాలకు విరాళాలుగా రూ.1,11,400, వివిధ సేవలకు రూ.32,500, ప్రసాదాల విక్రయాలతో రూ.39,000 ఆదాయం సమకూరిందని ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

పీజీ వైద్య ప్రవేశ పరీక్షలో వాసుకి ప్రతిభ


సత్యవాసుకి

మామిడికుదురు: కేంద్రీయ విశ్వ విద్యాలయాల పీజీ వైద్య ప్రవేశ పరీక్షలో మామిడికుదురుకు చెందిన డాక్టర్ ధూళిపూడి వెంకట సత్యవాసుకి ఉత్తమ ప్రతిభ చూపింది. ఇటీవల ఎయిమ్స్ నిర్వహించిన ఇన్నిసెట్–2023 ప్రవేశ పరీక్షలో ఆమెకు జాతీయ స్థాయిలో 472వ ర్యాంకు లభించింది. ఈ ఫలితాలు శనివారం రాత్రి విడుదలయ్యాయి. విశాఖపట్నంలోని ప్రైవేటు వైద్య కళాశాలలో ఆమె ఎంబీబీఎస్ పూర్తి చేసింది. ప్రస్తుతం వాసుకి వైద్య రంగంలో ఎండీ జనరల్ మెడిసిన్ కోర్సు అభ్యసిస్తోంది. ఇటీవల విడుదలైన నీట్ పీజీ పరీక్షలో కూడా వాసుకి జాతీయ స్థాయిలో 2,083వ ర్యాంకు సాధించింది. గ్రామీ ణ స్థాయిలో పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందుబాటులోకి తీసుకురావాలన్న తపనతో తన తండ్రి డీవీవీ సత్యనారాయణ, తల్లి ఉపాధ్యాయురాలు భ్రమరాంబ లక్ష్యాలకు అనుగుణంగా ఇంటర్ నుంచి ప్రణాళిక ప్రకారం అడుగులు వేశానని వాసుకి తెలిపారు. ఎటువంటి కోచింగ్ లేకుండా స్వీయ శిక్షణలోనే తాను మంచి ఫలితాలు సాధించడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. లక్ష్యం ప్రకారం ముందుకు వెళ్తే క్లిష్టమైన ప్రవేశ పరీక్షల్లో కూడా ఉత్తమ ర్యాంకు సాధించవచ్చన్నారు.

కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ పరీక్షల్లో 898వ ర్యాంకు


మెహెర్ చైతన్య

ఆలమూరు : మండలంలోని పెదపళ్లకు చెందిన నామాల మెహెర్ చైతన్య జాతీయ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ పోటీ పరీక్షల్లో అత్యుత్తమ 898 ర్యాంకు సాధించాడు. శనివారం రాత్రి ఈ ఫలితాలు విడుదలైనట్లు ఆయన ఆదివారం తెలిపారు. ఈ ర్యాంకుతో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో అత్యుత్తమ సంస్థగా పేరొందిన కాగ్‌లో ఉద్యోగం సంపాదించాడు. 2017లో స్టాఫ్ సెలక్షన్ కమిషన్‌కు, 2019లో ఇన్‌కమ్ ట్యాక్స్ అసిస్టెంట్‌గా ఉద్యోగం పొందాడు.


మృతదేహాలను వ్యాన్‌లో కాకినాడ జీజీహెచ్‌కు తరలిస్తున్న దృశ్యం


ఆస్పత్రిలో క్షతగాత్రులకు ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ పరామర్శ


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ముమ్మిడివరం, కాకినాడ రూరల్ ఎమ్మెల్యేలు పొన్నాడ సతీష్, కురసాల కన్నబాబు


కాకినాడ జీజీహెచ్‌లో యానాం ఎమ్మెల్యే అశోక్ వద్ద విలపిస్తున్న మృతుల కుటుంబీకులు

చితికిన బతుకులు

- తాళ్లరేవు ప్రమాద మృతులందరూ మహిళలే
- అందరూ నిరుపేదలే..
- బలిగొన్న వాహనాల అతివేగం.. నిర్లక్ష్యం

ముమ్మిడివరం/తాళ్లరేవు/యానాం/కాకినాడ క్రైం: అందరూ నిరుపేదలే.. కుటుంబ రథాలు కాస్త సాఫీగా సాగడానికి రెక్కలు ముక్కలు చేసుకుంటూ ఇం‘ధనం’ సంపాదిస్తున్నారు.. పొట్టకూటి కోసం రోజూ మాదిరిగానే వారు రొయ్యల ఫ్యాక్టరీకి వెళ్లారు. అక్కడ పనులు ముగించుకుని తిరిగి వస్తుండగా.. ప్రైవేటు బస్సు రూపంలో మృత్యువు దూసుకువచ్చింది. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం 216 జాతీయ రహదారిపై బైపాస్ జంక్షన్‌లో ఆదివారం మధ్యాహ్నం ఏడుగురు మహిళలను బలి తీసుకున్న ఆటో ప్రమాదానికి.. బస్సు డ్రైవర్ అతి వేగం.. ఆటో డ్రైవర్ నిర్లక్ష్యమే కారణంగా కనిపిస్తున్నాయి. ప్రమాదానికి గురైన మొత్తం 13 మంది మహిళలూ యానాం, పరిసర ప్రాంతాలకు చెందిన వారే. వీరందరూ తాళ్లరేవు మండలం కోరంగి పంచాయతీ పరిధిలోని ఎపెక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో (రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్) పని చేస్తున్నారు. ఉదయం వెళ్లి, మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఆటోలో ఇళ్లకు తిరుగు పయనమయ్యారు. ఇదిలా ఉండగా కాకినాడ నుంచి హైదరాబాద్ వెళ్లే మోజో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డీజిల్ నింపుకొనేందుకు యానాం వచ్చింది. అక్కడి నుంచి తిరిగి కాకినాడ వెళ్తూ.. ఎదురుగా మహిళా కార్మికులతో వస్తున్న ఆటోను స్థానిక సుబ్బారాయుని దిబ్బ వద్ద బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. కాకినాడ జీజీహెచ్‌లో మరో మహిళ మృతి చెందింది. ఈ ప్రమాదంలో మరో నలుగురు మహిళలు తీవ్రంగా, ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు.

ప్రమాదపు అంచున ప్రయాణాలు

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సముద్ర తీరం వెంబడి ఆక్వా కల్చర్ పెరగడంతో దానికి అనుబంధంగా ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పడ్డాయి. కాకినాడ తీరం వెంబడి వందలాదిగా రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్లు వెలిశాయి. ముఖ్యంగా తీర ప్రాంత మండలమైన తాళ్లరేవులోనే అధిక సంఖ్యలో ప్లాంట్లు ఉన్నాయి. వీటిల్లో కాకినాడ, కోనసీమ జిల్లాలకు చెందిన వేలాది మంది రోజు కూలీలుగా పని చేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి కొన్ని పరిశ్రమలు బస్సు సౌకర్యం కల్పిస్తున్నాయి. మరికొన్ని పరిశ్రమలకు ప్రైవేటు వాహనాల్లోనే కూలీలను తరలిస్తారు. ఇదే అవకాశంగా కొంతమంది ఆటోవాలాలు పరిమితికి మించి కూలీలను ఎక్కించుకోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. సాధారణంగా ఆటోలో నలుగురు ప్రయాణించాల్సి ఉండగా, ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ ఏకంగా 13 మంది కూలీలను ఎక్కించుకున్నాడు. దూసుకువస్తున్న బస్సును ముందుగానే గుర్తించిన ఆటో డ్రైవర్ గిడ్డి వెంకటేశ్వరరావు బయటకు దూకేసి ప్రాణాలు దక్కించుకోగా, ఆటోలోని ఏడుగురు మహిళలు బలయ్యారు. మిగిలిన వారు క్షతగాత్రులుగా మిగిలారు. ఈ ప్రమాదానికి కారణమైన ప్రైవేటు బస్సు డ్రైవర్ మద్యం తాగి, అతి వేగంగా వాహనాన్ని నడిపాడని, అందువల్లే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని పలువురు ఆరోపిస్తున్నారు.

జాతీయ రహదారి రక్తసిక్తం

ప్రమాద తీవ్రతకు ఆటో నుజ్జునుజ్జయ్యింది. మృతదేహాలు ఛిద్రమై ఎగిరిపడటంతో జాతీయ రహదారి రక్తసిక్తమైంది. ఆ ప్రాంతం హృదయ విదారకంగా మారింది. బంధువులు, కుటుంబ సభ్యుల రోదనలు ఆ ప్రాంతంలో మిన్నంటాయి. వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, పార్టీ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్, యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్‌లు సంఘటన స్థలానికి వెంటనే చేరుకున్నారు. క్షతగాత్రులను కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తాళ్లరేవు సీహెచ్‌సీలోను, కాకినాడ జీజీహెచ్‌లోను క్షతగాత్రులను పరామర్శించి, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యేలతో పాటు యానాం డిప్యూటీ కలెక్టర్ కూడా కాకినాడ జీజీహెచ్‌లో క్షతగాత్రులను, మృతుల కుటుంబీకులను పరామర్శించారు. మరింత మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రులను అపెక్స్ సంస్థ ప్రతినిధులు కాకినాడ మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘోర ప్రమాదం పెనుతుపానులా కుదిపివేయడంతో మృతుల కుటుంబ సభ్యులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. ఎవరు కదిపినా ఏమీ మాట్లాడలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. వారిని ఇరుగుపొరుగువారు ఓదార్చుతున్నారు. మృతదేహాలను కాకినాడ జీజీహెచ్‌లోని మార్చురీలో భద్రపరిచారు. సోమవారం ఉదయం పోస్టుమార్టం నిర్వహించనున్నారు. ఈ ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్‌పై 304, 337, 338 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కోరంగి ఎస్సై పి.శ్రీనివాస్ కుమార్ తెలిపారు.


ప్రమాద స్థలంలో చెల్లాచెదురుగా పడి ఉన్న మృతదేహాలు, నుజ్జయిన ఆటో


ప్రమాదానికి కారణమైన బస్సు

మృతులు

కర్రి పద్మ (39), వెంకట్‌నగర్, కొత్త బస్టాండ్
బొక్కా అనంతలక్ష్మి (47), ఫ్రాన్స్‌తిప్ప
నిమ్మకాయల వెంకటలక్ష్మి (54), కురసాంపేట
చింతపల్లి జ్యోతి (38), వెంకట్‌నగర్, **కొత్త బస్టాండ్**
శెట్టి వెంకటలక్ష్మి (41), మెట్టకూరు
కర్రి పార్వతి (42)
బూడపనీటి సత్యవతి (35), బాలయోగి నగర్

క్షతగాత్రులు

రక్ష వెంకటేశ్వరమ్మ, ఫ్రాన్స్‌తిప్ప
మల్లాడి గంగాభవానీ, ఫ్రాన్స్‌తిప్ప
ఓలేటి లక్ష్మి, కురసాంపేట
నోట్ల సత్యవతి, మెట్టకూరు
కోటి నీలిమ, మెట్టకూరు
బూడపనీటి ప్రభావతి, ఫ్రాన్స్‌తిప్ప
చింతపల్లి మంగాయమ్మ, ఫ్రాన్స్‌తిప్ప

వీరిలో రక్ష వెంకటేశ్వరమ్మ, చింతపల్లి మంగాయమ్మల పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు వెల్లడించారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

ఈ సంఘటన తనను తీవ్రంగా కలచివేసిందని యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్ అన్నారు. మృతుల కుటుంబాలకు తీవ్ర సంతాపం తెలిపారు. మృతులు, క్షతగాత్రుల కుటుంబాలను ప్రభుత్వ పరంగా అన్నివిధాలా ఆదుకుంటామని చెప్పారు. మృతుల కుటుంబాలకు పుదుచ్చేరి సీఎం రంగసామి రూ.లక్ష ఆర్థిక సాయం ప్రకటించారని తెలిపారు. ప్రమాదానికి ట్రావెల్స్ సంస్థను బాధ్యులను చేస్తామని, వారి నుంచి బాధిత కుటుంబాలకు పరిహారం రాబడతామని చెప్పారు.


ప్రమాద స్థలాన్ని సందర్శించిన కాకినాడ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి

మాతృ దినోత్సవం వేళ.. మహా విషాదం

యానాం: మే నెలలో రెండో ఆదివారం– అంతర్జాతీయ మాతృదినోత్సవం. సరిగ్గా ఇదే రోజున ఆ ఏడుగురు తల్లులూ తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయారు. బతుకుతెరువు కోసం తాళ్లరేవు రొయ్యల ఫ్యాక్టరీకి వెళ్లిన వారు తిరిగి క్షేమంగా వచ్చేస్తామని, తమ పిల్లా పాపలతో, కుటుంబీకులతో ఆనందంగా గడపుతామని భావించారు. అంతలోనే వారి జీవితాలు అర్థాంతరంగా ముగిసిపోయాయి. మాతృదినోత్సవం నాడు తమ మాతృమూర్తులు మరణించడంతో వారి బిడ్డలు గుండెలు పగిలేలా పొగిలి పొగిలి విలపిస్తున్నారు.

- యానాం ఫ్రాన్స్‌తిప్ప గ్రామానికి చెందిన బూడపనీటి సత్యవతికి ఇద్దరు సంతానం. వీరిలో ఒకరైన ప్రభావతి హైస్కూల్‌కు వేసవి సెలవులు కావడంతో తల్లితో పాటు రోజూ రొయ్యల ఫ్యాక్టరీకి తోడుగా వెళ్తోంది. ఈ ప్రమాదంలో ఆమె సైతం తీవ్రంగా గాయపడింది. సత్యవతి పెద్ద కుమార్తె సరస్వతికి వివాహం కుదిరింది. నిశ్చితార్థం కూడా జరిగింది. త్వరలోనే వివాహం జరగనుంది. సత్యవతి తల్లి కూడా వీరితోనే ఉంటోంది. సత్యవతి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా రోదిస్తున్నారు.
- యానాం వెంకట్‌నగర్ కొత్త బస్టాండ్‌కు చెందిన కర్రి పద్మ ఆరు నెలలుగా రొయ్యల ఫ్యాక్టరీలో పనికి వెళ్తోంది. ఆమె భర్త కూలి పని చేస్తారు. పద్మకు సంతానం లేకపోవడంతో సొంత ఆడపడుచు కుమార్తె సత్యగౌరిని చిన్నప్పుడే దత్తత తీసుకుని, అల్లారుముద్దుగా పెంచారు. ఆమె ప్రస్తుతం ఇంటర్మీడియెట్ చదువుతోంది. ఆమె అంటే పద్మకు ఎంతో ప్రేమ. డ్యూటీ నుంచి వచ్చిన వెంటనే కుమార్తెతో ఎక్కువసేపు గడపుతుంది. పద్మ మృతితో ఆమె భర్త, కుమార్తె సత్యగౌరి తీవ్ర విషాదంలో మునిగిపోయారు.
- మెట్టకూరుకు చెందిన శెట్టి వెంకటలక్ష్మి భర్త రిలయన్స్ కంపెనీలో పార్ట్‌టైమ్ ఉద్యోగిగా పని చేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. ఒక కుమార్తె పుదుచ్చేరిలో ఇంజినీరింగ్ చదువుతోంది. రెండో కుమార్తె యానాంలో ప్రైవేటు కాలేజీలో ఇంటర్మీడియెట్ చదువుతోంది. ఆటో ప్రమాదం జరిగే సమయానికి భర్త విధి నిర్వహణలో ఉన్నారు. సమాచారం తెలిసిన వెంటనే కాకినాడ జీజీహెచ్‌కు చేరుకున్నారు. అక్కడ విగతజీవిగా ఉన్న భార్య వెంకటలక్ష్మిని చూసి బోరుమంటూ విలపించడం అందరినీ కలచివేసింది.
- ఈ ప్రమాదంలో మరో మృతురాలు కర్రి పార్వతిది మెట్టకూరు. ఈమె కుటుంబం కొంత కాలం నుంచి యానాం పట్టణ పరిధిలోని కొత్తపేట అగ్రహారంలో ఉంటున్నారు. ప్రమాద సమాచారం తెలియగానే కుటుంబ సభ్యులందరూ పరుగుపరుగున కాకినాడ జీజీహెచ్‌కు తరలివెళ్లారు. పార్వతి మృతితో ఆ కుటుంబంలో పెను విషాదం అలముకుంది.


ఇంటివద్ద విషాదంలో సత్యవతి కుమార్తె సరస్వతి, తల్లి


పద్మ ఇంటి వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, కుమార్తె సత్యగౌరి

- ప్రమాదంలో మృతి చెందిన బొక్కా అనంతలక్ష్మిది ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా. భర్త, సంతానం లేరు. యానాం ఫ్రాన్స్‌తిప్పలో ఇటీవలే అద్దెకు వచ్చింది. జీవనోపాధి కోసం రొయ్యల ఫ్యాక్టరీకి వెళ్తూ ఒంటరి మహిళగా జీవనం సాగిస్తోంది.
- మరో మృతురాలు నిమ్మకాయల వెంకటలక్ష్మికి ఇద్దరు కుమారులు. ఇద్దరికీ వివాహమైంది. సొంతంగా జీవనం సాగించాలనే ఉద్దేశంతో వెంకటలక్ష్మి నాలుగేళ్లుగా ఎపెక్స్ ఫ్యాక్టరీలో పని చేస్తూ, ఊహించనివిధంగా జరిగిన ఈ ప్రమాదంలో దుర్మరణం పాలైంది.
- చింతపల్లి జ్యోతి ఆరు నెలలుగా రొయ్యల ఫ్యాక్టరీలో పనికి వెళ్తోంది. ఆమెకు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు ఆరో తరగతి, కుమార్తె నాలుగో తరగతి చదువుతున్నారు. ఉదయాన్నే భోజనం, కూర వండేసి ఫ్యాక్టరీకి బయలుదేరిన జ్యోతి.. నాన్నకు భోజనం పెట్టాలని చెప్పి వెళ్లిందని, ఇంతలోనే ఈ ఘోరం చోటుచేసుకుందంటూ కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

చక్కగా.. పక్కాగా..


నిర్మాణంలో ఉన్న దిశ వన్‌స్టాప్ సెంటర్ నూతన భవనం


నిర్మాణ ప్రక్రియను పరిశీలిస్తున్న పీడీ ప్రవీణ

- సిద్ధమవుతున్న దిశ వన్ స్టాప్ సెంటర్ నూతన భవనం
- జీజీహెచ్‌లో అన్ని సదుపాయాలతో నిర్మాణం
- ఆగస్టు నాటికి అందుబాటులోకి..

కాకినాడ క్రైం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పరిగణిస్తున్న దిశ వన్‌స్టాప్ సెంటర్‌కు మరిన్ని సౌకర్యాలు కలగనున్నాయి. నిత్యం మహిళలు, మైనర్ల సమస్యలపై పని చేసే ఈ సెంటర్‌కు ప్రత్యేక భవనం సిద్ధమవుతోంది. కాకినాడ జీజీహెచ్ నర్సింగ్ స్కూల్ సమీపాన ఎంసీహెచ్ బ్లాక్‌ను ఆనుకొని ఈ భవన నిర్మాణం జరుగుతోంది. దిశ వన్ స్టాప్ సెంటర్ పరిధిలో బాధిత మహిళలు, మైనర్లకు ఏడు రకాల సేవలు అందుతున్నాయి. తక్షణ స్పందన, వైద్య సహాయం, కౌన్సెలింగ్, పోలీస్ సహాయం, న్యాయ సహాయం, తాత్కాలిక వసతి, వీడియో కాన్ఫరెన్స్ సేవల ద్వారా బాధితులకు ఇక్కడ సాంత్వన చేకూరుస్తున్నారు. నూతన భవనం అందుబాటులోకి వస్తే బాధితులకు మరిన్ని నాణ్యమైన సేవలు అందించేందుకు అవకాశం ఏర్పడుతుంది.

రూ.50 లక్షలతో నిర్మాణం

ఈ భవనాన్ని 1,600 చదరపు గజాల విస్తీర్ణంలో రూ.50 లక్షల వ్యయంతో ఆంధ్రప్రదేశ్ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ) నిర్మిస్తోంది. భవన నిర్మాణం ఇప్పటికే దాదాపు పూర్తి కాగా, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనులు జరుగుతున్నాయి. తొలుత జీ+1 ప్రణాళికతో దీనిని నిర్మించాలని నిర్ణయించినా.. తక్షణం తొలి దశలో గ్రౌండ్ ఫ్లోర్ నిర్మించి, వచ్చే ఆగస్టు లోగా అందుబాటులోకి తీసుకురానున్నారు. దిశ వన్ స్టాప్ సెంటర్ నూతన భవనం సకల సదుపాయాలు, అధునాతన హంగులతో రూపుదిద్దుకోనుంది. బహుళ ప్రయోజనాల కోసం 1,500 చదరపు గజాల విస్తీర్ణంలో వివిధ విభాగాలను నిర్మించారు. షార్ట్ స్టే షెల్టర్ రూమ్, కౌన్సెలింగ్ గది, మెడికల్ ఎగ్జామినేషన్ రూమ్, వీడియో కాన్ఫరెన్స్ గది, స్టాఫ్ రూమ్, సెంటర్ అడ్మినిస్ట్రేటర్ రూమ్, వెయిటింగ్ హాలు, స్టోర్ రూముతో పాటు అదనంగా వంట గది, మూడు మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నారు. రెండో దశలో నిర్మించనున్న పై అంతస్తులో అడ్మిన్ షెల్టర్ ఏర్పాటు చేయనున్నారు. దిశ వన్ స్టాప్ సెంటర్‌లో ప్రస్తుతం 12 మంది సిబ్బంది పని చేస్తున్నారు. వివిధ సమస్యలతో ప్రతి నెలా కనీసం 30 మంది బాధితులు వన్ స్టాప్ కేంద్రాన్ని ఆశ్రయిస్తున్నారు. బాధితులకు, వారి సహాయకులకు, సిబ్బందికి కొత్త భవనంలో మరిన్ని మెరుగైన సదుపాయాలు అందనున్నాయి.

నూతన భవనంతో బహుళ ప్రయోజనాలు



దిశ వన్ స్టాప్ సెంటర్ నూతన భవన నిర్మాణంతో బహుముఖ ప్రయోజనాలు చేకూరనున్నాయి. సౌలభ్యాల పరంగా సిబ్బంది, నాణ్యమైన సేవల పరంగా బాధితులు ప్రయోజనం పొందనున్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా సాధికార అధికారి (పీడీ) కొండా ప్రవీణ స్వీయ పర్యవేక్షణలో ఈ భవన నిర్మాణం వేగంగా జరుగుతోంది. టైల్స్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనులు కూడా పూర్తయ్యే దశకు చేరాయి. తక్కువ విస్తీర్ణం కారణంగా ప్రస్తుతం ఆర్ఎంసీ క్వార్టర్స్‌లో ఉన్న సెంటర్ నిర్వహణలో ఇబ్బందులు వస్తున్నాయి. కొత్త భవన నిర్మాణంతో ఈ సమస్య పరిష్కారం కానుంది.

– రంగనాథం శైలజ, అడ్మిన్, దిశ వన్ స్టాప్ సెంటర్

వచ్చే నెలలో ‘తూర్పు’ దేవాంగ సంఘం మహాసభ

రాజమహేంద్రవరం సిటీ: దేవాంగ సంక్షేమ సంఘం మహాసభను జూన్ 25వ తేదీ ఆదివారం స్థానిక జాంపేటలోని ఉమారామలింగేశ్వరస్వామి కల్యాణ మంటపంలో జరపాలని అడ్‌హక్ కమిటీ నిర్ణయించింది. ఆ కల్యాణ మంటపంలో ఆదివారం అడ్‌హక్ కమిటీ చైర్మన్ కాలెపు సత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. అడ్‌హక్ కమిటీ కన్వీనర్, రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పుచ్చల రామకృష్ణ మాట్లాడుతూ నూతన జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం ఏర్పాటు చేసి మహాసభ నిర్వహించాలని 60 మందితో కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఇంకా ఎవరైనా ముందుకు వస్తే కమిటీలోకి తీసుకుంటామన్నారు. కాలెపు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ వచ్చే నెల 25వ తేదీన జరిగే మహాసభలోపుగా.. జిల్లాలోని 19 మండలాల అడ్‌హక్ కమిటీ సభ్యులు తిరిగి, ఆ మండలాల్లో సమావేశాలు జరిపి, ప్రతినిధులను ఎంపిక చేసి జిల్లా కమిటీలో స్థానం కల్పించి, సమష్టిగా సంఘం అభివృద్ధికి దోహదపడాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నగర సంఘం అధ్యక్షుడు రొబ్బి విజయ శేఖర్, కల్యాణ మండపం అధ్యక్షులు గంపా సోమలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మృతిచెందిన దుర్గ

ఏలేశ్వరం: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం తిరుమాలి గ్రామంలో జరిగింది. ఎస్సై సతీష్ కథనం ప్రకారం.. ఏలేశ్వరం పల్లపువీధికి చెందిన కొండపల్లి దుర్గ (18) తన స్నేహితుడు ఉండూరు వెంకటరెడ్డితో కలసి యర్రవరం వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో తిరుమాలి వచ్చేసరికి బైక్ నడుపుతున్న వెంకటరెడ్డి బైక్‌ను అదుపుచేయలేక చెట్టును ఢీకొన్నాడు. దీంతో వెనుక కూర్చున్న దుర్గ తలకు తీవ్ర గాయం కాగా అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటరెడ్డికి తీవ్ర గాయాలు కాగా ప్రభుత్వాసుపత్రి తరలించారు. ఈ మేరకు ఎస్సై సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ ఢీకొని వృద్ధుడి దుర్మరణం

కాకినాడ రూరల్: పండూరు గ్రామంలో ట్రాక్టర్ ఢీకొని వలవల ఏసుబాబు (72) మృతి చెందాడు. తిమ్మాపురం పోలీసుల కథనం ప్రకారం.. శనివారం సాయంత్రం పొలం నుంచి నడిచి వస్తున్న ఏసుబాబును ఏనుగు వీధి రామాలయం వద్ద ట్రాక్టర్ ఢీకొంది. వెంటనే కుటుంబ సభ్యులు సర్పవరం జంక్షన్ వద్ద ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అతను రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య సుందరమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై నాగార్జునరాజు కేసు నమోదు చేశారు. మృతదేహానికి జీజీహెచ్‌లో ఆదివారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు రైటర్ ఆలీషా తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

కిర్లంపూడి: వ్యక్తి అదృశ్యంపై ఆదివారం స్టేషన్‌లో కేసు నమోదైనట్లు ఏఎస్సై బీఎస్ఎన్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల్లోకి వెళితే.. భూపాలపట్నం గ్రామానికి చెందిన యర్రమిల్లి రాంబాబు హైదరాబాద్‌లో ఉన్న తన కొడుకు వద్ద ఉంటున్నారు. ఈ నెల 3వ తేదీన తన స్వగ్రామానికి వచ్చి 9వ తేదీన హైదరాబాద్ వెళ్లడానికి భూపాలపట్నం నుంచి కిర్లంపూడికి ఆటో ఎక్కాడు. హైదరాబాద్ చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులను అడగగా రాలేదని చెప్పడంతో రాంబాబు కొడుకు యర్రమిల్లి వెంకట రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కుమార్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94409 04834 నంబర్‌కు ఫోన్ చేయాలని అన్నారు.

వ్యసనాలతో చోరీల బాట

- బెట్టింగ్‌లకు బానిసైన బ్యాంక్ అధికారి
- ఉద్యోగం పోగొట్టుకుని వరుస చోరీలు
- చివరికి కటకటాల పాలు


అన్నవరంలో వివరాలు వెల్లడిస్తున్న పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి

అన్నవరం: అతనో బ్యాంకు ఉద్యోగి.. ఎనభై వేలకు పైబడి జీతం వస్తున్నా వ్యసనాల ఉచ్చులో పడి చివరికి చోరీలను అలవాటుగా మార్చుకున్నాడు.. ఉద్యోగాన్నీ పోగొట్టుకుని పోలీసులకు చిక్కాడా నిందితుడు. అన్నవరంలో భారీ చోరీ చేసిన అతను గంటల వ్యవధిలోనే పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యాడు. దీనికి సంబంధించి ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో పెద్దాపురం డీఎస్పీ కె.లతా కుమారి విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. బెట్టింగ్‌ల ఉచ్చులో చిక్కుకుని ఉద్యోగం పోగొట్టుకుని నేరాల బాట పట్టిన బ్యాంక్ అధికారి నర్సీపట్నం మండలం పీనారిపాలెం గ్రామానికి చెందిన చిటికెల నాగేశ్వరరావు ఈ చోరీ చేసినట్లు ఆమె వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన కథనం ప్రకారం.. చైతన్య గోదావరి బ్యాంక్‌లలో అసిస్టెంట్ మేనేజర్‌గా 2015న చిటికెన నాగేశ్వరరావు చేరాడు. ఆలమూరు మండలం నర్సిపూడి, కిర్లంపూడి మండలం సోమవరం, గొల్లప్రోలు, ఏలేశ్వరం, నిడమర్రు గ్రామాల్లోని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు శాఖల్లో పనిచేశాడు. అతనికి రూ.85 వేల వరకూ నెల జీతం వచ్చేది. అయితే బెట్టింగ్‌లతో అక్రమంగా ఆర్జించి కోటీశ్వరుడు కావాలనే ఆశ అతన్ని దొంగగా మార్చింది. తను పనిచేసిన నిడమర్రు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు లాకర్‌లో బంగారం దొంగిలించి సస్పెన్షన్‌కు గురయ్యాడు. అప్పటి నుంచి ఆర్థిక నేరాల బాట పట్టాడు. ఏలేశ్వరంలో ఓ బ్యాంక్ ఏటీఎం పగలకొట్టి నగదు అపహరించిన కేసులో అరెస్టయి బెయిల్‌పై జైలు నుంచి వచ్చాడు. అయినా నేర ప్రవృత్తి మానలేదు.

చోరీ ఎలా చేశాడంటే..

గొల్లప్రోలు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేసినప్పుడు అన్నవరంలోని సత్యదేవా జూనియర్ కళాశాల వెనుక ఉన్న న్యూ కాలనీలో అద్దెకు ఉండేవాడు. అతను కారులో అన్నవరం నుంచి గొల్లప్రోలుకు రోజూ వెళ్లి వచ్చేవాడు. ఆ తరువాత విధుల నుంచి సస్పెండ్ అయ్యాక తిరిగి అన్నవరం వచ్చి ఇళ్లపై రెక్కీ నిర్వహించాడు. విశ్రాంత ప్రిన్సిపాల్ సీహెచ్ అప్పారావు ఇంట్లో అద్దెకుంటున్న ఉపాధ్యాయుడు గోగుల వీరభద్రరావు కుటుంబం ఇంటికి తాళాలు వేసుకుని స్వగ్రామం ద్రాక్షారామ వెళ్లింది. ఈ విషయం గమనించి ఈ నెల 12వ తేదీ అర్ధరాత్రి 1.30 గంటలకు ఐరన్ కట్టర్‌తో ఇంటి తలుపు తాళం కట్ చేసి ఇంట్లోకి ప్రవేశించాడు. బీరువాలోని రూ.22,44,400 విలువైన 33.8 కాసుల బంగారు ఆభరణాలు, కేజీన్నర వెండి ఆభరణాలు, రూ.50 వేల నగదు అపహరించాడు. కాగా చోరీ జరిగిన విషయం తెలిసిన వెంటనే ద్రాక్షారామ నుంచి హుటాహుటిన అన్నవరం వచ్చిన ఉపాధ్యాయుడు వీరభద్రరావు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే ప్రత్తిపాడు సీఐ కిశోర్‌బాబు ఆ ఇంటిని పరిశీలించారు. చోరీ జరగడానికి రెండ్రోజుల ముందు కారు ఆ ఇంటి ముందు నుంచి రెండు, మూడు సార్లు వెళ్లిన విషయం పరిశీలించారు. ఆ కారు నంబర్ ఆధారంగా నిందితుడు నాగేశ్వరరావు వివరాలు సేకరించారు. అతని సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా ఎక్కడ ఉన్నాడో గమనించి 48 గంటల వ్యవధిలోనే ఈ కేసును ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేశారు. అతని నుంచి బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ కె.లతాకుమారి తెలిపారు. నిందితునిపై గతంలో ఏలేశ్వరం ఏటీఎం పగలకొట్టి రూ.2,34,000 అపహరించిన కేసు నమోదైందని వివరించారు. సమావేశంలో ప్రత్తిపాడు సీఐ కె.కిశోర్‌బాబు, అన్నవరం, ప్రత్తిపాడు, ఏలేశ్వరం ఎస్‌ఐలు పి.శోభన్‌బాబు, ఎం.పవన్‌కుమార్, జి.సతీష్, అడిషనల్ ఎస్‌ఐ అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నెత్తిన నిప్పుల కుంపటి


ఎదుర్లంక - యానాం వంతెన వద్ద నిర్మానుష్యంగా మారిన 216 జాతీయ రహదారి

- గణనీయంగా పెరిగిన ఉష్ణోగ్రతలు
- రాజమహేంద్రవరంలో 44.5 డిగ్రీలు

సాక్షి, అమలాపురం: భగభగ మంటూ భానుడు నిప్పులు చెరిగాడు.. అమాంతం నడి నెత్తిన సెగలు పుట్టించాడు.. సూర్యుడి ఉగ్ర రూపానికి పచ్చని సీమ కోనసీమతో పాటు ఉమ్మడి జిల్లా మండిపోతోంది. తారెత్తిస్తున్న ఎండలకు వేడి గాలులు తోడవడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ బయటకు రావాలంటేనే భయపడిపోయారు. ఇక మధ్యాహ్న సమయంలో భానుడు నిప్పుల కుంపటిగా మారిపోయాడు. దీంతో ప్రధాన రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. వేసవి మొదలైన తరువాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఆదివారం అత్యధికంగా గరిష్ఠ ఉష్ణోగ్రత 43.1 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. ఇది కోనసీమలో అధికమనే చెప్పాలి. రాజమహేంద్రవరంతో పోల్చుకుంటే ఇక్కడ ఉష్ణోగ్రతలు కనీసం ఐదు డిగ్రీలు తక్కువగా ఉంటాయి. అటువంటిది రాజమహేంద్రవరంతో సమానంగా ఉష్ణోగ్రత నమోదైంది. మరో వైపు రాజమహేంద్రవరంలో 44.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కావడం విశేషం. కాకినాడలో 37.8 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. వీటితో పాటు మండపేట, తుని, పెద్దాపురం, రాజోలు వంటి ప్రాంతాల్లో కూడా ఎండ మండించింది. ఉమ్మడి జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా అధికంగా నమోదవుతున్నాయి. కాకినాడలో 27.9, రాజమహేంద్రవరం, అమలాపురంలలో 27 డిగ్రీల సెల్సియస్ నమోదయ్యింది. సాయంత్రం, రాత్రి వేళల్లో కూడా వేడి గాలి తగ్గకపోవడంతో సామాన్యులు ఆపసోపాలు పడుతున్నారు. అధిక ఉష్ణోగ్రత కారణంగా విద్యుత్ వినియోగం సైతం భారీగా పెరిగింది. దీనివల్ల పలుచోట్ల లోడ్ ఎక్కువై ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోయి విద్యుత్ సరఫరాకు అవాంతరాలు ఏర్పడుతున్నాయి. స్వచ్ఛంద సంస్థలు, ఎన్జీఓల ఆధ్వర్యంలో ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి నీళ్లు, మజ్జిగను బాటసారులకు సరఫరా చేస్తున్నాయి.

గౌడలు గర్వించదగిన మహోన్నతుడు పాపన్న

- గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్
- కొవ్వూరులో పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ


సభలో మాట్లాడుతున్న గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, చిత్రంలో హోం మంత్రి తానేటి వనిత, ఎంపీ భరత్‌రామ్

కొవ్వూరు: బహుజనుల తరపున పోరాటం సాగించి గోల్కొండ కోటను పాలించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గౌడ జాతి గర్వించదగిన మహనీయుడని గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. ఆదివారం రాత్రి కొవ్వూరు శివారు గామన్ ఇండియా బ్రిడ్జి జంక్షన్ వద్ద రాష్ట్ర గౌడ సంఘం అసోసియేట్ అధ్యక్షుడు తాతా కృష్ణారావు ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత, ఎంపీ మార్గాని భరత్‌రామ్‌లతో కలసి మంత్రి జోగి రమేష్ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన గౌడ జనభేరి బహిరంగ సభలో మంత్రి రమేష్ మాట్లాడారు. లండన్‌లోని కేంబ్రిడ్జి యూనివర్సిటీలో పాపన్న గౌడ్ పేరుతో రెండు పుస్తకాలు రాయడం గర్వించదగిన విషయమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో గౌడ కులానికి చెందిన తనకు మంత్రి పదవి ఇచ్చి ప్రాధాన్యం కల్పించారన్నారు. అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తులే ప్రాతినిధ్యం వహించిన రాజమహేంద్రవరం పార్లమెంట్ స్థానాన్ని తొలిసారి గౌడ కులానికి చెందిన మార్గాని భరత్‌రామ్‌కు ఇచ్చిన ఘనత సీఎం జగన్‌దే అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అత్యధిక ప్రాధాన్యం కలిస్తున్నారన్నారు. హోం మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ జ్యోతీరావు పూలే కంటే ముందు పాపన్న గౌడ్ వంటి మహనీయులు బడుగు, బలహీన వర్గాల కోసం పోరాటం సాగించారన్నారు. జమిందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం సాగించి బహుజనుల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారన్నారు. రాజమహేంద్రవరం ఎంపీ బీసీ కావడం వలనే ప్రజలు గెలిపించారన్నారు. బహుజన యోధుడి విగ్రహం తన నియోజకవర్గంలో ఏర్పాటు చేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల కోసం 16వ శతాబ్దంలోనే పాపన్న గౌడ్ అలుపెరగని పోరాటం సాగించారన్నారు.

ప్రత్యేకంగా గొరిల్లా సైన్యాన్ని తయారు చేసుకున్న పోరాట యోధుడన్నారు. గోల్కొండ కోటను ఏలిన పాపన్న గౌడ్ తమ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడం గర్వంగా ఉందన్నారు. మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, రాష్ట్ర బీసీ జేఏసీ అధ్యక్షుడు మార్గాని నాగేశ్వరరావు, గౌడ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టా వీరబాబు గౌడ్, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

పేలిన ట్రాన్స్‌ఫార్మర్

- నిడదవోలు సబ్ స్టేషన్‌లో మంటలు
- గంటన్నర పాటు విద్యుత్తు అంతరాయం


నిడదవోలు సబ్ స్టేషన్‌లో మంటలను అదుపు చేస్తున్న సిబ్బంది

నిడదవోలు: స్థానిక 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ (సీటీ) పేలడంతో ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా మంటల చెలరేగాయి. ఇలా జరగడం ఇది రెండోసారి. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటంతో ఎండ వేడికి ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోవడంతో మంటలు రేగాయి. సబ్ స్టేషన్‌లో సాయంత్రం 5.50 గంటలకు మంటలు రావడం గమనించిన సిబ్బంది విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చారు. విద్యుత్ శాఖ పట్టణ ఏఈ ఎస్.శ్రీనివాస్ వచ్చి తన సిబ్బందితో మంటలను ఆర్పే చర్యలు చేపట్టారు. నిడదవోలు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. సబ్ స్టేషన్‌లో జరిగిన ప్రమాదంతో సుమారు గంటన్నర పాటు నిడదవోలు పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. అనంతరం విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి


తండ్రి మృతి చెందడంతో రోదిస్తున్న మునిశేఖర్ దంపతులు

అనపర్తి: స్థానిక రైల్వే స్టేషన్‌లో విశాఖపట్నం- విజయవాడ డౌన్ లైన్‌పై రైలు ఢీకొని ఓ వృద్ధుడు దుర్మరణం పాలయ్యాడు. జీఆర్పీ ఎస్సై బి.లోవరాజు కథనం ప్రకారం.. తిరుపతి జిల్లా నాయుడుపేటకు చెందిన పైడాల మునిశేఖర్ కొంత కాలంగా కామెర్లతో బాధపడుతున్నాడు. రామచంద్రపురం మండలం వెల్ల గ్రామంలో కామెర్ల వ్యాధికి మందు ఇస్తారని మునిశేఖర్ తండ్రి ముత్తు (66) తెలుసుకున్నాడు. తన కుమారుడు మునిశేఖర్, కోడలు మల్లికలతో కలసి శనివారం సర్కారు ఎక్స్‌ప్రెస్‌కు బయలుదేరి ఆదివారం అనపర్తి చేరుకున్నారు. ఇదిలా ఉండగా అనపర్తి ఒకటో నంబరు ప్లాట్‌ఫాం పైకి వచ్చే క్రమంలో రైల్వే ట్రాకు దాటుతున్న ముత్తును రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టడంతో మృతి చెందాడు. తమ కళ్లెదుటే తండ్రి మృతి చెందడంతో కుమారుడు మునిశేఖర్, కోడలు మల్లిక రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. సమాచారం అందుకున్న సామర్లకోట జీఆర్పీ సిబ్బంది శవపంచనామా అనంతరం మృతదేహాన్ని అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లోవరాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

కొవ్వూరు: కాపవరం ఫ్లైఓవర్ బ్రిడ్జిపై శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి చెందాడు. ఈ నెల 13న కాకినాడ జిల్లా పెద్దాపురం ఊక లోడు వేసుకుని తిరిగి హైవేపై ఖమ్మం వెళుతున్న లారీని కాపవరం సమీపంలో రోడ్డుకి అవతలి వైపు నుంచి ఎదురుగా వచ్చిన మరో లారీ డివైడర్ మీదుగా నుంచి దూసుకొచ్చి ఢీకొంది. లారీతో పాటు వెనుక ఉన్న కారు కూడా పాడైంది. ఈ ప్రమాదంలో లారీడ్రైవర్ సుల్తాన్‌పూర్‌కి చెందిన హసన్‌రాజ్ యాదవ్ (43) లారీ క్యాబిన్‌లో ఇరుక్కుని మృతి చెందారు. కాపవరం సమీపంలో ఉన్న ఫ్లైఓవర్‌పై ఈ ప్రమాదం చోటు చేసుకుందని రూరల్ ఎస్సై జి.సతీష్ తెలిపారు. ఖమ్మం వైపు వెళుతున్న లారీ డ్రైవర్ కం ఓనర్ అయిన కోట చంద్రమోహన్ ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించినట్టు ఎస్సై తెలిపారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు


కోనసీమ జిల్లా చెస్ చాంపియన్ పోటీల్లో విజేతలతో నిర్వాహకులు

అమలాపురం రూరల్: అమలాపురం లయన్స్ క్లబ్‌లో జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాల బాలికల ఓపెన్ చదరంగం పోటీలు ఉత్సాహవంతంగా జరిగాయి. అసోసియేషన్ కన్వీనర్ తాడి వెంకట సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 70 మంది క్రీడాకారులు హాజరయ్యారు. బాలుర విభాగంలో ద్రాక్షారపు సాత్విక్ చాంపియన్‌గా, కొండా శివేంద్ర ద్వితీయ, యర్రంశెట్టి చరణ్ తృతీయ స్థానం, గిరిమణి శేఖర్ నాల్గో స్థానం సాధించారు. వీరు ఈ నెల 25 నుంచి తిరుపతిలో జరుగనున్న రాష్ట్ర చెస్ పోటీలకు ఎంపికయ్యారు. బాలికల చదరంగ పోటీల్లో పనిశెట్టి ధరణి చాంపియన్‌గా, గెద్దాడ అక్షయ ద్వితీయ, జి.ఆశ్రయ తృతీయ, బండారు జోష్ణవి నాల్గో స్థానం సాధించి ఈ నెల 18 నుంచి విజయవాడలో జరిగే రాష్ట్ర మహిళల చెస్ పోటీలకు ఎంపియ్యారు. విజేతలకు లయన్స్ ప్రతినిధులు, అంతర్జాతీయ చెస్ న్యాయ నిర్ణేత జీవీ కుమార్ బహుమతులు అందజేశారు.

నీటిలోనే బాతులాడుతూ..


ఎండలు మండుతున్నాయి. పశు పక్ష్యాదులు అల్లాడుతున్నాయి. వేడి నుంచి ఉపశమనానికి రాయవరం మండలం మాచవరం సమీప మండపేట కాలువలోని కొద్దిపాటి నీటిలో బాతులు ఇలా జలకాలాడాయి. బాతుల సంరక్షకులు ఉదయం, సాయంత్రం వేళల్లో వాటిని మేతకు తీసుకెళ్తూ మధ్యాహ్నం వేళ ఇలా నీటిలో వదులుతున్నారు. ఇది చూపరులను ఆకర్షిస్తోంది. - రాయవరం